పోలమాంబ ఆలయానికి కొత్తశోభ



ఆలయ ముఖద్వారానికి వేసిన రంగులు

- దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు
- శరవేగంగా రంగులు వేసే పనులు



పోలమాంబ ఆలయ గోపురానికి రంగులు వేయడానికి నిర్మించిన పరంజి

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయానికి దాతల సహకారంతో కొత్తశోభ తీసుకొస్తున్నారు. రాజగోపురం, ఆలయ ముఖద్వారాలకు దాతలు స్వచ్ఛందంగా రంగులు వేయిస్తున్నారు. నగరానికి చెందిన దాత శిరుమళ్ల వెంకటేష్ తన సొంత నిధులు దాదాపు రూ.4.5 లక్షలు ఖర్చుచేసి రాజగోపురం, ప్రవేశ ముఖద్వారం(ఆర్చ్), ఆలయం లోపల స్తంభాలకు రంగులు వేయిస్తున్నారు. కొన్నేళ్లుగా ఆలయానికి రంగులు వేయాల్సి ఉంది. గతంలో వేసినవి వెలిసిపోయాయి. ప్రస్తుతం దాతల సహాయంతో ఆలయం పూర్తిస్థాయిలో సప్తవర్ణశోభితమై కొద్దిరోజుల్లో దర్శనమివ్వనుంది.

విగ్రహాలకు మరమ్మతులు

ఆలయ రాజగోపురంపై ఉన్న పలు విగ్రహాలు కొన్ని చోట్ల స్వల్పంగా దెబ్బతిన్నాయి. వీటిని సైతం శిల్పులతో మరమ్మతులు చేయించి, రంగులు వేయించే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పరంజి నిర్మించి ఆలయం ఆర్చ్‌కు తొలిదశ రంగులు వేయడం, ఆలయం లోపల స్తంభాలకు రంగులు వేయడం పనులు ప్రారంభమై జోరుగా సాగుతున్నాయి. త్వరలో జరిగే అమ్మవారి వార్షిక పండగ సమయానికి ఆలయం కొత్తశోభతో భక్తులకు కనిపించేలా పనులు నిర్వహిస్తున్నారు.

నూతన ఆర్చ్ నిర్మాణం

ప్రస్తుతం పోలమాంబ ఆలయానికి వెళ్లడానికి ఒక స్వాగత ద్వారం(ఆర్చ్) ఉంది. దీనికి అదనంగా కల్యాణ మండపానికి వెళ్లే మార్గంలో కూడా ఒక ఆర్చ్ నిర్మించడానికి దాత ముందుకు వచ్చారు. నగరానికి చెందిన వై.ప్రసాదరెడ్డి తన సొంత నిధులతో మరో ఆర్చ్‌ను నిర్మించి ఇస్తున్నారు. దీనికి సంబంధించిన భూమిపూజ సైతం ఇటీవల నిర్వహించారు. త్వరలో దీని నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దాతల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ఆలయంలో జరగనున్నాయి.



ఆలయం లోపల రంగులు వేస్తున్న కార్మికుడు

క్లుప్తంగా

మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం



హోం మంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సురేష్‌బాబు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమివ్వడం అభినందనీయమని డాక్టర్ వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూలిడి సురేష్‌బాబు అన్నారు. నగరానికి విచ్చేసిన రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దిశ చట్టం ద్వారా మహిళల్లో ధైర్యం నింపారన్నారు. దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ ఎలా ఉపయోగించాలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సురేష్‌బాబుతోపాటు విజయ్‌కుమార్ ఉన్నారు.

19న 'మా రామయ్య' గీతం విడుదల



రామయ్య పాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అభిషేక్ తదితరులు

మద్దిలపాలెం: అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19న యూట్యూబ్‌లో అయోధ్యకు వచ్చేన య్య.. మా రామయ్య గీతాన్ని విడుదల చేయనున్నట్లు యూట్యూబర్ అభిషేక్ తెలిపారు. ప్రస్తుతం విశాఖ పరిసర ప్రాంతాల్లో ఈ పాటను చిత్రీకరిస్తున్నామన్నారు. పెదవాల్తేరు రామలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో మంగళవారం రామయ్య పాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నిమిషాల నిడివి గల ఈ పాటను ఆరిలోవ తోటగరువు కృష్ణుడి మందిరం పరిసరాల్లో చిత్రీకరిస్తున్నట్లు చెప్పారు. భార్గవ్ మాట్లాడుతూ ఆరవ్ ప్రొడక్షన్ బ్యానర్‌లో తెలుగు, హిందీ భాషల్లో ఈ పాటను విడుదల చేస్తున్నామన్నారు. దసరాకు ఒక పాట విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

పోలీసుల అదుపులో ఆరుగురు జూదరులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పరిధి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సాయిసౌధా అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.95,550 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు.

లలితా దీక్షలు ప్రారంభం



స్వామీజీ చేతుల మీదుగా లలితా దీక్ష స్వీకరిస్తున్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో సంక్రాంతి రోజున లలితా దీక్షలు ప్రారంభమయ్యాయి. మాఘ పౌర్ణమి వరకు 21 రోజుల పాటు దీక్ష కొనసాగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కుర్తాళం నుంచి వచ్చిన పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి శిష్యుడు సత్యానంద భారతి స్వామి చేతుల మీదుగా పలువురు భక్తులు అమ్మవారి దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా లలితాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

• నిర్మానుష్యం.. నిశ్శబ్దం

సంక్రాంతి సెలవులతో బోసిపోయిన ఏయూ

ఏయూక్యాంపస్: సంక్రాంతి పండగ సెలవులతో ఆంధ్ర విశ్వవిద్యాలయం బోసిపోయింది. వరుసగా ఐదు రోజులు సెలవులు రావడంతో వర్సిటీ నిర్మానుష్యంగా మారింది. విద్యార్థులు, ఆచార్యులు, ఉద్యోగులు లేకపోవడంతో మొత్తం ఖాళీ అయిపోయింది. నగరవాసులు సైతం పండగలకు తమ స్వగ్రామాలకు వెళ్లిపోవడంతో ఏయూ నుంచి వాహనాల రాకపోకలు సైతం లేవు. దీనితో వర్సిటీలో ఏ మూలన చూసినా నిశ్శబ్దం తాండవించింది. కేవలం పక్షుల శబ్దాలు మినహా వర్సిటీలో ఎటువంటి రణగొణ ధ్వనులు వినిపించలేదు. అన్ని విభాగాలు విద్యార్థులు లేక బోసిపోయాయి. గురువారం నుంచి విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో పనిచేయనుంది.



నిర్మానుష్యంగా పరిపాలనా భవనానికి వెళ్లే మార్గం



ఐఐఎం కూడలి వద్ద ఖాళీగా రహదారి



ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద..



భౌతిక శాస్త్ర విభాగం వద్ద..

పండగ సందడి



గోపూజలు నిర్వహిస్తున్న పురోహితులు



విద్యుత్ దీపాలంకరణలో పోలమాంబ ఆలయం

ఏయూక్యాంపస్: ఆలయాలు సంక్రాంతి పండగ శోభను సంతరించుకున్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సంప్రదాయ వస్త్రాలను ధరించి భక్తులు ఆలయాలకు విచ్చేశారు. కనుమ రోజును పెదవాల్తేరు పోలమాంబ అమ్మవారి ఆలయంలో గోపూజలు నిర్వహించారు. భక్తులు స్వయంగా గోమాతకు పూజలు జరిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలలో సుందరంగా తీర్చిదిద్దారు. పెదవాల్తేరు వేంకటేశ్వర స్వామి ఆలయ సముదాయాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా మకరజ్యోతి పూజలు



మకరజ్యోతి పూజలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మశాస్త ఆలయంలో మకరజ్యోతి పూజలు ఘనంగా నిర్వహించారు. కేరళలో గల శబరిమల అయ్యప్పస్వామి దేవస్థానంలో జ్యోతి దర్శనం సందర్భంగా ప్రతి ఏడాది పూజలు నిర్వహిస్తుంటారు. దీంట్లో భాగంగా అయ్యప్పస్వామికి విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు భార్గవశర్మ చేపట్టారు. అయ్యప్పస్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం హారతి కార్యక్రమం అత్యంత వైభవంగా చేపట్టారు. హారతి జ్యోతిలో అయ్యప్పను దర్శించుకున్న భక్తుల శరణం శరణుగోషతో ఆలయం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్, గురుస్వామి నీలాపు వెంకట రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

సింహాచలం: కనుమ పండగను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో మంగళవారం గోపూజలు విశేషంగా జరిగాయి. గోశాలలోని ఆవులకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పసుపుకుంకుమలు సమర్పించారు. శ్రీకృష్ణుడి విగ్రహం చెంతన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శ్రీకృష్ణాష్టకం పఠించి విశేషంగా హారతులు అందజేశా రు. దేవస్థానం అర్చకుడు సంతోష్‌శర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



గోవుకు మేత తినిపిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై ధారోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిని,గోదాదేవి ఒక పల్లకీలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకీలో అధిష్ఠింపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారిని, ఆళ్వారులను మరో పల్లకీలో వేంచేయజేసి మేళతాళాల మధ్య ఆలయం నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విశేషంగా స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. పాశుర విన్నప పఠనం చేశారు.

కనుమ వేళ.. నాన్‌వెజ్‌కు డిమాండ్



సీతమ్మధారలో మటన్ షాపు వద్ద జనం



నక్కవానిపాలెంలో నాటుకోళ్లు కొనేందుకు వచ్చిన వినియోగదారులు

చికెన్, మటన్ దుకాణాలు కిటకిట

సీతమ్మధార: సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. మంగళవారం కనుమ కావడంతో సీతమ్మధార, నక్కవానిపాలెంలోని ప్రధాన రహదారిలో గల నాటుకోడి మాంసం దుకాణాల వద్ద ప్రజలు ఉదయం నుంచి క్యూ కట్టారు. వినియోగదారులు భారీగా వచ్చి కొనుగోలు చేశారు. సంక్రాంతి అనంతరం కనుమ పండగ నాడు.. ప్రతి ఇంట్లో గారెలు, బిర్యాని, నాటుకోడి మాంసంతో బంధుమిత్రులకు భోజనాలు పెడతారు. దీంతో సీతమ్మధారలోని మాంసం దుకాణాలన్నీ జనంతో కిటకిటలాడాయి.

స్నేపర్ పార్కు సందర్శన వేళలివే..

సీతమ్మధార: నగరానికి మరింత వన్నె తెచ్చేలా జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.2.5 కోట్లతో స్నేపర్ పార్కును నిర్మించి ఇటీవల ప్రారంభించారు. ప్రజలు సేద తీరేలా ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌లు నాలుగు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లల ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా నాలుగు, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్లు, గెజిబో, ధ్యానం, యోగా కేంద్రాలు, యాంపీ థియేటర్ ఏర్పాటు చేశారు. ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటల వరకు స్నేపర్ పార్కును సందర్శించవచ్చు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్, ఈస్ట్ పార్కు ఏరియా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పార్కును నిర్వహిస్తున్నారు.

మాజీ సైనికులకు ఘన సత్కారం



ఆర్మీ సైనికులను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు ప్రభావతి ఆధ్వర్యంలో మిలటరీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ విభాగాల్లో పనిచేసిన మాజీ సైనికులను క్లబ్‌కు ఆహ్వానించి వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్వీస్‌లో వారు నేర్చుకున్న క్రమశిక్షణ, నిజాయతీ, దేశభక్తి, వారి అనుభవాలను చక్కగా వివరించారు. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి సేవలందించిన సైనికులను సత్కరించుకోవడం మన బాధ్యత అని ప్రభావతి అన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ గవర్నర్ శుభ, కార్యదర్శి ఎం.జయ, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు



ఆభరణాలను ఊరేగిస్తున్న గ్రామ పెద్దలు



అలంకరణలో అయ్యప్ప స్వామి

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలో గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు పీలా రమణ అయ్యప్ప స్వామి ఆభరణాలను తలపై మోసుకుంటూ గ్రామంలో ఊరేగించారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అయ్యప్ప స్వామి ప్రసాదాన్ని అందజేశారు. గ్రామ పెద్దలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి పౌరాణిక నటుడు అప్పలసూరి

మద్దిలపాలెం: ఉత్తమ పద్యనాటక నటుడు, ఆయుర్వేద వైద్యుడు పొన్నాన అప్పలసూరి నేటితరం నటులకు ఆదర్శమని చైతన్య సమితి అధ్యక్షుడు బీవీ అప్పారావు కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస దరి ఎరగాం గ్రామానికి చెందిన డాక్టర్ పొన్నాన అప్పలసూరి 90వ జన్మదిన వేడుకలు ఇసుకతోటలోని ఆయన ఇంట్లో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక నటుల్లో తొలితరానికి చెందిన పి.సూరిబాబు గాత్రాన్ని పోలిన గాత్రంతో అసాధరణ జ్ఞాపకశక్తి, క్రమశిక్షణతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారన్నారు. పొన్నాన అప్పలసూరి కుటుంబ సభ్యుల మధ్య నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఏయూ నాన్‌టీచింగ్ స్టాఫ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పొన్నాన అప్పలసూరికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న బీవీ అప్పారావు, మళ్ల శ్రీనివాసరావు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



ప్రత్యేక పూజలందుకున్న సీతారాములు



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

ఎంవీపీకాలనీ: శృతిరాజ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నిర్వహించిన క్లాసికల్ నృత్య నీరాజనం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీతారాముల భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక హారతి, అర్చన కార్యక్రమాన్ని కనువిందుగా నిర్వహించారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు, భరతనాట్య ప్రదర్శన వీక్షించారు. మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు టీటీడీ క్యాలెండర్లను నిర్వాహకులు అందజేశారు.

జోష్ నింపిన సంక్రాంతి సంబరాలు



శిల్పారామంలో సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా పల్లె జీవన విధానాన్ని ప్రతిబింబించే సంప్రదాయ నృత్యాలు నిలిచాయి. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని సోమవారం శ్రీ సిద్ధేంద్ర యోగీ నాట్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి , జానపద నృత్యాల ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. సంక్రాంతి పండగ ముఖ్య అంశంగా రూపొందించిన నృత్య రూపకం ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. కళాకారులు యశ్మిత,పద్మ,సారిక,వేదిత తదితరులు కార్యక్రమాన్ని రక్తి కట్టించారు.

కనుమ రోజున.

జోష్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన నృత్యాలు అదరహో అనిపించాయి. రామ శబ్దం,నోమి నోమిన్నాలో, ఏరువాకా సాగారో తదితర గీతాలకు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమాలను స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

సామాన్యుల సేవలో మాస్టర్ ఈకే సంస్కృతి సదన్

మహారాణిపేట: సామాన్యులకు తన వంతు సేవలందించడమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రధాన ఆశయమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. 30 ఏళ్లుగా పీఠం చేసిన సేవల వివరాలతో కూడిన సావనీర్(ప్రత్యేక సంచిక)ను అంకోసా ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఆధ్యాత్మిక, సేవా సంస్థలకు మార్గదర్శకత్వం వహించిన మాస్టర్ ఈకే పార్వతీకుమార్ సత్సంకల్పానికి ప్రతిరూపమే మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ అని పేర్కొన్నారు. 1994లో డాక్టర్ టి.వి.వి.ఎస్.రావు నేతృత్వంలో తాటిచెట్లపాలెంలో మాస్టర్ హోమియో వైద్యాలయం ఏర్పాటు చేసి వేలాది మందికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు 444 మందికి ఉచిత విద్యనందించినట్లు చెప్పారు. సంస్కృతీ భవన్ నిర్మాణానికి సహకరించిన ప్రభుత్వ అధికారులు, దాతలు, కార్యకర్తలకు సత్యదేవ్ కృతజ్ఞతలు తెలిపారు జగద్గురు పీఠం సలహా మండలి సభ్యుడు సిహెచ్.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ బాలవికాస కేంద్రంలో 324 మంది చిన్నారులకు ప్రవేశం కల్పించామన్నారు. సంగీత జనకులం ద్వారా కూడా సేవలందిస్తున్నామని చెప్పారు. ట్రస్ట్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.వి.ఎస్.మూర్తి, నిర్వాహక సభ్యులు అజ్జరపు శ్రీనివాస్, యు.సి.హెచ్.బి.వర్మ, సర్కిల్ ఆఫ్ గుడ్ విల్ కార్యనిర్వాహక సభ్యుడు జి.వి.ఎస్. హరి, బి.ఆర్.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సిహెచ్.ఎస్.ఎన్.రాజు, సత్యదేవ్, బి.ఆర్.కె.రాజు